సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 12 । మార్చి । 2023



కొండపై భక్తుల రద్దీ

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారికి పూజలు చేశారు.



ముగిసిన యాత్రలు

ధర్మపురి: శ్రీవేంకటేశ్వరస్వామి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు ముగిసిపోవడంతో శనివారం రాణాలో ప్రత్యేక పూజలు చేశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.0/20.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండవేడిమి తగ్గినట్లు అనిపిస్తుంది. మధ్యాహ్నం వాతావరణం వేడెక్కుతుంది.

న్యూస్‌రీల్

సంచార ప్రయోగశాలపై విద్యార్థుల ఆసక్తి



ప్రయోగం చేయిస్తున్న ఉపాధ్యాయుడు

ధర్మారం: విద్యార్థుల్లో పరిశీలనాత్మక శక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన సంచార విజ్ఞాన–గణిత ప్రయోగశాలతో గుణాత్మక విద్య అందించవచ్చని విషయ నిపుణులు కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని మేడారం రాష్ట్ర రెసిడెన్షియల్ పాఠశాలతోపాటు కేజీబీవీలో శనివారం సంచార ప్రయోగశాల ద్వారా పలు ప్రయోగాలు చూపిస్తూ వివరించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి పాఠ్య పుస్తకాల్లోని కఠిన అంశాలను కృత్యాధార బోధన పూర్తయినట్లు తెలిపారు. భౌతిక, రసాయన, గణితం, వృక్షశాస్త్రాల్లో 60కి పైగా అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవీలత, విషయ నిపుణులు కృష్ణమూర్తి, శంకర్, జగన్, చొక్కారావు, వంశీకృష్ణ, సంజీవ్, లక్ష్మణ్, సీఆర్‌టీలు కళ్యాణి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల చర్చలు వాయిదా



చర్చల్లో జేఏసీ, యాజమాన్యం, కాంట్రాక్టర్లు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందం అమలుపై జరిగిన చర్చలు వాయిదా పడ్డాయి. శనివారం ప్రాజెక్టులోని ఆడిటోరియంలో జరిగిన వేతన ఒప్పందం చర్చల్లో యాజమాన్యం ప్రతినిధులు, జేఏసీ నాయకులు, కాంట్రాక్టర్లు పాల్గొని 2018 ఒప్పందంలోని పెండింగ్ అంశాలతోపాటు కొత్త వేతన ఒప్పందంపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం చర్చలను ఈనెల 13కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. చర్చల్లో జేఏసీ నాయకులు కౌశిక హరి, చిలుక శంకర్, నాంసాని శంకర్, భూమల్ల చందర్, భూమయ్య, కాంట్రాక్టర్లు, యాజమాన్యం ప్రతినిధులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

గోదావరిఖని: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శనివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు నూనె లతామోహన్, ముద్దసాని సంధ్యారెడ్డి, శాంత లక్ష్మి, గోలివాడ చంద్రకళ, తోడేటి స్వరూప, స్వాతి, సీత, గుర్రం పద్మ, కేతమ్మ, మేకల సరోజన, నాగమణి, బండారి రాధ, కార్పొరేటర్లు అడ్డాల స్వరూప, దాతు శ్రీనివాస్, బాల రాజ్‌కుమార్, అడ్డాల గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ పార్టీలను బీజేపీ వేధిస్తోంది

- ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ వ్యాఖ్యలు సరికావు
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



మాట్లాడుతున్న కోరుకంటి చందర్

రామగుండం: ప్రాంతీయ పార్టీలను వేధించడం బీజేపీకి అలవాటుగా మారిందని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. ఈడీ పేరుతో భయాందోళనకు గురి చేయడం, ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాలను కూల్చడం బీజేపీ విధానాలను విమర్శించారు. లిక్కర్ స్కాంలో దర్యాప్తు సంస్థలు ఎమ్మెల్సీ కవితను విచారణకు పిలవడం.. కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అసభ్యకరంగా మాట్లాడడం ఆయన కుసంస్కారానికి నిదర్శనమన్నారు. బీజేపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు.

మనఊరి ముచ్చట

రచ్చబండ వద్ద పొద్దంతా కాలక్షేపం..

- గల్లీ నుంచి ఢిల్లీ రాజకీయాల వరకు..
- మంచి, చెడులు పంచుకునే వేదిక
- ఊరి అనుబంధాల సూచిక
- ఊళ్లో పంచాయితీలన్నీ ఇక్కడే..
- గ్రామ ఐకమత్యానికి సజీవ సాక్ష్యం

హరీబరి జీవితం.. ఖాళీగా ఉంటే సెల్‌ఫోన్‌తోనే కాలక్షేపం. పక్కవారి యోగక్షేమాలు పట్టనికాలం. ఎదుటి వ్యక్తితో కన్నా.. సెల్‌ఫోన్‌లోనే ఎక్కువగా బంధాలను పెంచుకుంటున్న ఈ సమాజంలో ఇప్పటికీ చాలా గ్రామాల్లో రచ్చబండలు అనుబంధాలకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. పొద్దున నిద్రలేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకు సావటిగద్దె వద్ద చర్చలెన్నో.. ఊరి పంచాయితీలు.. సాదకబాధలు.. గ్రామంలో సమస్యలు.. రాష్ట్ర రాజకీయాలు.. దేశంలో చోటుచేసుకుంటున్న సంఘటలు ఇలా.. నలుగురైదుగురు కలిస్తే చర్చకొచ్చే అంశాలు ఎన్నెన్నో. ప్రస్తుత బిజీ జీవితంలో చాలా గ్రామాల్లోని రచ్చబండలు కనుమరుగైపోగా.. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ ఉదయం.. సాయంత్రం సందడిగా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కొన్ని రచ్చబండలపై సండే స్పెషల్..!!

– సాక్షి, కరీంనగర్ డెస్క్

మల్లన్న: ఏం సంగతే ఐలన్న కేంద్రంల పాలు పోశినవానే..
ఐలన్న: ఆ..ఆ.. ఇప్పుడే పోశిన్నే.. కన్నారం పోవాలే పని ఉంది... పోతన్న..
మల్లన్న: ఏ.. నీ.. పోతువుగానీ.. ఆగరాదే. దా ఈడ గూసో.. ఇగో గీ రాజన్న సంగతి చెప్పు కొద్దిగ..
ఐలన్న: ఏమైందే.. రాజన్న ఏం సంగతే. ఏదో మనాదిగ కనబడతున్నవ్..
రాజన్న: ఏంలేదే ఐలన్న... కొడుకు గురించే రందయితంది. వాడు సదువుకున్నడు గానీ ఇంకా ఏ నౌకరి దొరుకతలేదు.
ఐలన్న: ఏ గదానికి రంది పడతావే.. ఏదో ఒకటి దొరుకుద్ది కదా.. మొన్న రాయమల్లు కొడుకు కన్నారంలో ఓ నౌకరిల చేరిండంట.
రాజన్న: నేనూ గదే అనుకుంటున్ననే కొడుకును కన్నారమన్నా.. పట్నానికన్నా పంపిద్దామనుకుంటన్న. ఇక్కడ ఆగమాగం తిరుగుతుండు.
మల్లన్న: సరేగానీ పగటీలి ఎవరో సార్లు అత్తరంట కదనే. ఈడనే గద్దె కాన్నే అందరూ జమైతరట. ఊళ్లె పనుల గురించి మాట్లాడుతరట. ఎగిలివారంగనే సాటింపు జేసిండ్రు.
ఐలన్న: ఆ.. అయితే నేనుసుత జెల్దీ కన్నారం పోయస్త. బర్లకు తౌడు.. పిండి బత్తాలు తేవాలే.. మల్లన్న నువ్వు కూడా ఉంటవానే..
మల్లన్న: పొలంకాడికి పోయొస్తనే.. అందరూ జమయ్యే సరికి అస్త. నువ్వు కూడా రాయే రాజన్న.. మనకేమన్న ఫాయిదా ఉంటదో సూద్దాం.
రాజన్న: మంచిదే.. గట్లనే పోయస్త... మీరూ తొందరగా రండ్రి..

(జిల్లాలోని ఓ గ్రామంలో ఉన్న రచ్చబండ వద్ద శనివారం ఉదయం నడిచిన చర్చ ఇది)



ఇది పెద్దపల్లి జిల్లాకేంద్రానికి సమీపంలో ఉన్న పెద్దకల్వలలోని రచ్చబండ వేదిక. పక్కనే ఆలయం.. ఊరి నడిబొడ్డున ఈ వేదిక ఉంటుంది. పురాతన వేపచెట్టు చుట్టూ గద్దె నిర్మించగా.. సాయంత్రం ఆరైందంటే చాలు గ్రామంలోని యువత, వృద్ధులు ఇక్కడికి చేరుకుంటారు. గ్రామంలోని మాటాముచ్చట.. ఇతర రాజకీయాలు చర్చిస్తుంటారు.. సద్దుల బతుకమ్మ ఇక్కడే ఆడుతారు.. దసరా ఉత్సవాలు కూడా ఇదే వేదికగా ఘనంగా నిర్వహిస్తామని సర్పంచ్ వివరించారు.



వృద్ధులు ఒక్కచోట చేరి ముచ్చటించుకుంటున్న ఈ దృశ్యం తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామం. నక్సలైట్ల ప్రాబల్యం ఉన్న సమయంలో ఉదయం పోలీసుల బూట్ల చప్పుళ్లతో.. రాత్రి అయితే నక్సలైట్ల పాటలతో నిండేది. కాలక్రమేణ యువత ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టడం.. ఇక్కడున్న వారు వ్యాపారాలు చేస్తుండడంతో గ్రామం అభివృద్ధి బాటపట్టింది. అయితే రచ్చబండ మాత్రం అలాగే ఉంది. ఉదయం అయిందంటే రచ్చ బండ వద్దకు వృద్ధులు ఒక్కరొక్కరుగా చేరుకుంటుంటారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా.. ఎలాంటి అభివృద్ధి పనులైనా నిర్ణయం తీసుకోవాలనుకుంటే గ్రామస్తులు సైతం ఇక్కడే సమావేశమవుతుంటారు. గ్రామంలో వందకు వందశాతం వ్యవసాయ కుటుంబాలే కావడంతో ఏ పంటకు ఏ మందు వాడాలనేది కూడా ఇక్కడే సమావేశమై చర్చించుకుంటారు. ఈ గ్రామానికి మరో ప్రత్యేకత కూడా ఉంది. గ్రామంలో ఏ కులస్తులు చనిపోయినా ఇంటికొకరు చొప్పున వెళ్లి అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఉంటారు.

ఎన్నో అంశాలకు చర్చావేదిక..

ఇప్పటికీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని చాలా గ్రామాల్లో రచ్చబండలు ఉన్నాయి. గ్రామంలోని ఓ పురాతనమైన చెట్టు.. దాని చుట్టూ గద్దె.. ఆ గద్దెపై ఎప్పుడూ పదిమంది గ్రామస్తులు మాట్లాడుకోవడం ప్రతీ గ్రామంలో కనిపించే దృశ్యం. పండుగలైనా.. పబ్బాలైనా... గ్రామంలో ఏ సంఘటన జరిగినా పూర్తి సమాచారం ఆ గద్దెవద్దే దొరుకుతుంది. కరెంటు బిల్లుల నుంచి కూరగాయల విక్రయాలు.. వారసంతలు.. గ్రామానికి సంబంధించిన ఏ సమావేశం అయినా ఇక్కడే జరుగుతూ ఉంటుంది. వృద్ధుల కాలక్షేప కబుర్లు.. యువకుల సంభాషణలు.. రైతుల కష్టసుఖాలకు సాక్ష్యంగా నిలుస్తుంది రచ్చబండ. ఆ ఊరికి ఆవే స్వాగత తోరణాలుగా నిలుస్తూ ఉదయం, సాయంత్రం జనాలతో కిటకిటలాడుతున్నాయి.



ఇది జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం చింతకుంట గ్రామంలోని రచ్చబండ. ఇది గ్రామ పంచాయతీ కార్యాలయానికి పక్కనే ఉంటుంది. పురాతన వేపచెట్టు ఉండగా... కొన్నేళ్లక్రితం దాని చుట్టూ గద్దె నిర్మించారు. ఈ గద్దెపై ఉదయం, సాయంత్రం గ్రామస్తులతో సందడిగా ఉంటుంది.. ఇక్కడ కూరగాయలు కూడా విక్రయిస్తుంటారు. పంచాయతీలో ఏవైనా సమావేశాలు జరిగినప్పుడు ఈ చెట్టుకింద నిర్వహించేందుకే ప్రాధాన్యం ఇస్తుంటారు.



కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వెల్ది గ్రామంలోని రచ్చబండ ఇది.. గ్రామంలో ఏ సమావేశమైనా ఇక్కడే. దీన్ని గ్రామస్తులు గడికాడి గద్దెగా పిలుచుకుంటారు. గ్రామంలో ఏ పంచాయితీ అయినా ఇక్కడే నిర్వహిస్తారు. గతంలోనే ఈ వేపచెట్టు చుట్టూ గద్దె నిర్మించగా.. ఇప్పుడు ప్రస్తుత యువత సిమెంటు గద్దె నిర్మించి.. ఏటా ఇక్కడ వినాయకచవితికి విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు.



చాయి తాగుతూ కుశలప్రశ్నలు వేసుకుంటున్న ఈ వృద్ధులది గంభీరావుపేట. నిత్యం ఉదయం, సాయంత్రం చాయి తాగేందుకు ఇక్కడే కలుసుకుంటారు. దాదాపు బస్టాండ్, రామాలయం ఏరియాకు చెందిన దాదాపు పది నుంచి పదిహేను మంది వృద్ధులు ఇక్కడే చేరుతూ కాలక్షేపం చేస్తుంటారు. ఇరువై ఏళ్లుగా నిత్యం ఇక్కడ కనిపిస్తున్న దృశ్యం ఇది.



ఈ చిత్రం.. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్‌లోని రచ్చబండ. ఈ గ్రామంలో గ్రామ పంచాయతీ, రచ్చబండ, మహాత్మాగాంధీ విగ్రహాలు పక్కపక్కనే ఉన్నాయి. గతంలో వేపచెట్టు ఉండేది. పదిహేనేళ్ల క్రితం ఆ చెట్టు చుట్టూ గద్దె నిర్మించారు. పంచాయతీ గ్రామసభలైనా.. గ్రామంలోని చిన్నచిన్న సమస్యలైనా ఇక్కడే సమావేశం అవుతుంటారు. నిత్యం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు గ్రామంలోని వృద్ధులు ఇక్కడే కూర్చుంటుంటారు. కుశల ప్రశ్నలు వేసుకుంటూ.. గల్లీ నుంచి ఢిల్లీ రాజకీయాలపై గంటలకొద్దీ చర్చలు నడిపిస్తారు.



పెద్దపల్లి మండలం నిట్టూర్‌లోని రచ్చబండ ఇది.. గ్రామపంచాయతీకి సమీపంలో ఉన్న వేపచెట్టు చుట్టూ గద్దె నిర్మించడంతో గ్రామస్తులు అందరూ ఇక్కడే సమావేశం అవుతుంటారు. కరెంట్ బిల్లులు.. పన్నుల వసూలు ఇక్కడే చేస్తారు. ఉదయం, సాయంత్రం కూరగాయల విక్రయం ఉంటుంది. గ్రామంలో ఏ సమస్య ఉన్నా ఇక్కడికి వచ్చే పరిష్కరించుకుంటారు.

ఇక్కడే కలుస్తుంటాం



గ్రామానికి సంబంధించిన ఎలాంటి చిన్న సమస్య అయినా ఇతర అభివృద్ధి పనులపై చర్చించాలన్న వేపచెట్టు కిందనే కలుస్తుంటాం. ఉదయం, సాయంత్రం అవకాశం ఉన్న వాళ్లందరూ గ్రామపంచాయతీ వద్ద గల వేపచెట్టు కిందనే కలిసి మాట్లాడుకుంటుంటాం. – బత్తుల బాబు, నారాయణపూర్

మనసున పట్టదు



రోజూ ఇక్కడికి రాకపోతే మనసున పట్టదు. మేం పోరగాండ్లప్పుడు మా పెద్దోళ్లు ఇక్కడికే వచ్చి ముచ్చట పెట్టుకునేటోళ్లు. పొలం పనులు చేతకాక ఇంటికాడనే ఉంటున్నం. రోజంతా ఇంటి దగ్గరే ఉంటుండడంతో మనసున పట్టక ఇక్కడికొచ్చి దోస్తులం కలుసుకుంటాం.– ఈరవేని శంకర్, గంభీరావుపేట

అన్ని ముచ్చట్లు తెలుస్తాయి



వయసు మీద ఉన్నప్పుడు పొలం పనులు చేసేటోళ్లం. అప్పుడు ఇక్కడికి వచ్చే తీరిక లేకుంటి. ఇప్పుడు పనులు చేతనైత లేవు. ఇంటికాడ ఉంటే ఏం తట్టదు. సాయంత్రం అయిందంటే చాలు బస్టాండ్ దగ్గర ఉన్న హోటల్‌కు వస్తాం. నా సోపతోళ్లందరూ ఇక్కడికే వస్తుండడంతో ఊరి మీది ముచ్చట్లు చర్చకు వస్తాయి. – భాస్కర్‌రెడ్డి, గంభీరావుపేట

బీఆర్‌ఎస్, బీజేపీ దొందూదొందే..

- జీఎస్టీ, 370 ఆర్టికల్స్‌కు మద్దతు ఇచ్చింది బీఆర్‌ఎస్ కాదా?
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 'వరంగల్ డిక్లరేషన్' అమలు
- తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసింది సోనియాగాంధీనే..
- కోరుట్ల సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



కోరుట్ల సభలో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, తదితరులు

కోరుట్ల:'బీజేపీ, బీఆర్‌ఎస్ దొందూ దొందే.. ఆనాడు జీఎస్టీకి, 370 ఆర్టికల్‌కు మద్దతుగా నిలిచింది కేసీఆరే కాదా?' అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి కోరుట్లలో జరిగిన బహిరంగ రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2004లో సోనియాగాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు పార్టీకి నష్టం జరిగినా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్రంతో ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తే.. కేసీఆర్ రెండుసార్లు సీఎంగా అధికారం చేపట్టినా వెతలు తీరలేదని విమర్శించారు. రైతులు ఎకరాపై రూ.50వేలు పెట్టుబడి పెడితే చివరికి ఆత్మహత్యలే దిక్కవుతున్నాయని అన్నారు. 'సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఆంధ్రోళ్లకు ఇక్కడి ఎమ్మెల్యే కల్వకుంట్ల అమ్ముడుపోతే.. పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.. మళ్లీ ఆయనకే టికెట్ ఇస్తున్నారంటే ఆంధ్రోళ్ల నుంచి ముట్టిన డబ్బుల్లో సీఎం కేసీఆర్ వాటా ఉన్నట్లే కదా' అని నిలదీశారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ, పసుపు బోర్డు ఏర్పాటులో మాట తప్పిన కవితను పాతాళానికి పంపిన ఘనత కోరుట్ల సెగ్మెంట్‌కు ఉందన్నారు. ప్రజలు తలచుకుంటే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు లెక్కకాదన్నారు. ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ల కోసం అసదుద్దీన్ బీఆర్‌ఎస్‌ను ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వండని కోరారు. ఇళ్లులేని ప్రతీ పేదకు రూ.5లక్షల సాయం, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఆడబిడ్డలకు రూ.500కు వంటగ్యాస్, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అభయం ఇచ్చారు. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం తెస్తాం.. పేదల కష్టాలు తీరుస్తామని ఆయన అన్నారు. మీ అందరి ఆశీస్సులతో 2024లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, కోరుట్ల సెగ్మెంట్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి రత్నాకర్ రావు, కొంరెడ్డి కరంచంద్, కల్వకుంట్ల సుజిత్‌రావు, జువ్వాడి కృష్ణారావు, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పసుపు కొనుగోళ్ల తీరు పరిశీలన

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు కొనుగోళ్లను శనివారం పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి ఆయన పంటకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎకరాకు ఎంత పెట్టుబడి, వచ్చే దిగుబడి, ప్రస్తుతం మార్కెట్‌లో పలుకుతున్న ధరల గురించి రైతులు ఆయనకు వివరించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం పంటకు మద్దతు ధర అందించిందని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు 'మద్దతు' ఇవ్వడం లేదని తెలిపారు. గతంలో క్వింటాల్‌కు రూ.16వేల ధర చెల్లిస్తే..మూడు, నాలుగు సంవత్సరాల నుంచి ధర రూ.ఏడేనిమిది వేలకు మించి రావడం లేదని చెప్పారు. ఈ సీజన్‌లో రూ.5వేల లోపే చెల్లిస్తున్నారని, దీనివల్ల పంటపై పెట్టిన పెట్టుబడి కూడా రాక నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ గత ఎన్నికల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని బాండ్ పేపర్ రాసి హామీ ఇచ్చారని, కానీ గెలిచిన తర్వాత దాని గురించి పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి యేటా పెట్టుబడి వ్యయం పెరుగుతుంటే..ధర మాత్రం తగ్గుతూ పోతుందన్నారు. పంటకు గిట్టుబాటు ధర అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. పసుపు రైతులకు మేలు జరిగేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు.

అధికారంలోకి వస్తే ఐదు లక్షలు..

పాదయాత్ర సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు తప్ప బీఆర్‌ఎస్ పేదలకు నిర్మించిన ఇల్లు ఒక్కటీ లేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక అర్హులు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారు. అయిలాపూర్ నుంచి కోరుట్ల వరకు సుమారు 6 కి.మీ. పాదయాత్ర చేశారు. నాయకులు జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావు, కల్వకుంట్ల సుజిత్‌రావు, కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రినిటిలో టెక్నోస్పార్క్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం టెక్నోస్పార్క్ 2కె23 జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం నిర్వహించారు. బాసర ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్, ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి ప్రాజెక్టు ఎక్స్‌పోను ప్రారంభించారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు టెక్నికల్ సింపోజియంలో పాల్గొని అంశాలను ప్రదర్శించారు. విద్యార్థులు సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్, ఏఓ సురేశ్, రాజిరెడ్డి, నటరాజన్, ఆరిఫ్, స్వాతి, ఆంజనేయులు, ప్రభాకర్, పద్మిని తదితరులున్నారు.

క్లుప్తంగా

ఏరియా ఆసుపత్రి తనిఖీ



టెస్టింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న బలరాం

గోదావరిఖని: సింగరేణి ఏరియా ఆసుపత్రిని డైరెక్టర్ (పా) బలరాం శనివారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రూ.14లక్షలతో కొనుగోలు చేసిన షుగర్ టెస్టింగ్ యంత్రాన్ని ప్రారంభించారు. అన్ని వార్డులను పరిశీలించారు. డైరెక్టర్ వెంట ఆర్జీ–1 జీఎం కె.నారాయణ, డీవైసీఎంఓ కిరణ్‌రాజ్‌కుమార్ తదితరులున్నారు.

ఆయన చూపు సజీవం



కాసర్ల మధు (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: మరణించినా ఆయన చూపు మాత్రం బతికే ఉంది. రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ తారక రామానగర్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ కాసర్ల మధు (45) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందిన విషయం తెల్సిందే. ఆయన కుటుంబ సభ్యులు మధు నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రాగా సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. మధు కళ్లను దానం చేసినందుకు ఆయన భార్య సరళదేవి, కుమార్తెలు సత్యప్రియ, సత్యదీపికను ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

హడలెత్తించిన నాగుపాము

కోల్‌సిటీ: గోదావరిఖని రమేష్‌నగర్‌లోని రీజనల్ ఆస్పత్రి సమీపంలో శనివారం ఓ నాగుపాము స్థానికులను హడలెత్తించింది. సింగరేణి క్వార్టర్‌లోకి చొరబడిన నాగుపామును చూసి క్వార్టర్‌లోని కార్మిక కుటుంబంతోపాటు స్థానికులు భయంతో వణికిపోయారు. విషయం తెలిసిన 44వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ.ముస్తాఫా స్నేక్ క్యాచర్ అప్సర్‌ను రప్పించారు. సుమారు గంటన్నర పాటు శ్రమించి పామును పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

బండి సంజయ్‌పై కేసు నమోదు చేయండి



వినతిపత్రం అందిస్తున్న మహిళలు

మంథని: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని మంథని పట్టణ బీఆర్‌ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు బుద్దార్థి రాణి సీఐ సతీష్‌కు ఫిర్యాదు చేశారు. బండి వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు కొట్టె పద్మ, నక్క నాగేంద్ర, తదితరులు ఉన్నారు.

భార్యపై గొడ్డలితో దాడి చేసిన భర్త అరెస్టు

మంథని: మంథని మండలం బిట్టుపల్లికి చెందిన బీర్క సారక్కపై గొడ్డలితో దాడి చేసిన ఆమె భర్త రాములును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. గొడ్డలితో దాడి చేయగా సారక్క ముఖంపై గాయాలయ్యాయని తెలిపారు. రాములు కొడుకు ఓదెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అయ్యో.. నాన్న

- ఎదురెదురుగా ఢీకొన్న రెండు బైక్‌లు
- ఇద్దరు మృతి... ఒకరికి తీవ్రగాయాలు
- కొడుకు కళ్లెదుటే పోయిన తండ్రి ప్రాణాలు



తండ్రి మల్లేశం మృతదేహం వద్ద రోదిస్తున్న శ్రీకాంత్



నేరెళ్ల సత్తయ్య మృతదేహం



మల్లేశం(ఫైల్)



నేరెళ్ల సత్తయ్య(ఫైల్)

గంగాధర(చొప్పదండి): పిల్లలందరూ స్థిరపడ్డారు... చిన్నకొడుకుకు పెళ్లిచేస్తే బాధ్యత తీరుతుందని ఆ తండ్రి ఆలోచన. కొడుకుతో కలిసి దేవుడికి మొక్కులు చెల్లించుకునేందుకు బైక్‌పై వెళ్లారు. దర్శనం అనంతరం ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు. పదిహేను నిమిషాల్లో ఇల్లు చేరుతారు. ఇంతలో ఘోరం జరిగింది. రెప్పపాటులో రెండు బైక్‌లు ఢీకొనడంతో తండ్రి అక్కడికక్కడే మరణించగా.. ఎదరుగా ఢీకొన్న బైక్‌పై ఉన్న వ్యక్తి ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. క్షణాల్లో విగతజీవిగా మారిన తండ్రి మృతదేహం వద్ద తీవ్రగాయాలతో ఒళ్లంతా రక్తంతో ఆ కొడుకు అయ్యోనాన్న.. మమ్మల్ని విడిచిపోయావా..! అంటూ రోదించిన తీరు కలిచివేసింది. ఈ ఘటన గంగాధర మండలం కురిక్యాల ప్రధాన రహదారిపై ప్రభుత్వ పాఠశాల వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది.

ఎదురెదురుగా ఢీకొని..

ఎస్సై రాజు, స్థానికుల వివరాల ప్రకారం.. రామడుగు మండలం గోలిరామయ్యపల్లి గ్రామానికి చెందిన కొలిపాక మల్లేశం(60) తన కొడుకు శ్రీకాంత్‌తో కలిసి ద్విచక్రవాహనంపై గంగాధర వైపు నుంచి కరీంనగర్ వైపు స్వగ్రామానికి వెళ్తున్నాడు. గంగాధర మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల సత్తయ్య(55) కరీంనగర్ వైపు నుంచి స్వగ్రామం ఇస్లాంపూర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. కురిక్యాల శివారులో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కొలిపాక మల్లేశం అక్కడికక్కడే మృతి చెందాడు. నేరెళ్ల సత్తయ్య ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు వదిలాడు. కొలిపాక శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు కాగా అంబులెన్సులో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

కళ్లముందే కన్నతండ్రి మృతి

రామడుగు మండలం గోలిరామయ్యపల్లి గ్రామానికి చెందిన కొలిపాక మల్లేశం గ్రామంలో కొన్నేళ్లుగా హోటల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడిని గ్రామంలో హోటల్ మల్లేశంగా పిలుస్తుంటారు. మల్లేశంకు ఇద్దరు కొడుకులు, కూతురు కాగా.. పెద్ద కొడుకు, కూతురు వివాహాలు అయ్యాయి. చిన్న కొడుకు శ్రీకాంత్ హైదరాబాద్‌లో ప్రయివేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం మల్లేశం చిన్నకొడుకు పెళ్లి చేసే ప్రయత్నాల్లో ఉన్నాడు. మల్లేశం శ్రీకాంత్‌తో కలిసి శనివారం సిరిసిల్ల సమీపంలోని ఓ ఆలయానికి వెళ్లాడు. తిరిగి బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో కురిక్యాల పాఠశాల వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొని మల్లేశం రోడ్డుపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాంత్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. మరో పదిహేను నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సి ఉండగా.. కొడుకు కళ్లెదుటే తండ్రి ప్రాణాలు కోల్పోవడం విషాదం నింపింది. ఒళ్లంతా గాయాలై రక్తంతో నిండిపోయినా.. శ్రీకాంత్ తనతండ్రి మృతదేహాన్ని చూసి రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.

మనుమరాలికి పేరుపెట్టి వస్తూ..

ఈ ప్రమాదంలో మరణించిన మరోవ్యక్తి నేరెళ్ల సత్తయ్యది గంగాధర మండలం ఇస్లాంపూర్. గీత కార్మికుడు. ఇతడికి ఇద్దరు కొడుకులు, కుమార్తె. అందరికీ వివాహాలు అయ్యాయి. చిన్న కొడుకు తండ్రికి తోడుగా స్థానికంగా వ్యవసాయం చేస్తుంటాడు. కూతురుకు కుమార్తె జన్మించగా.. కరీంనగర్‌లో శనివారం నామకరణ మహోత్సవం నిర్వహించారు. కుటుంబం మొత్తం కార్యక్రమానికి వెళ్లారు. సాయంత్రం కల్లుగీసే సమయం దగ్గరపడుతోందని సత్తయ్య ఒక్కడే ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. కురిక్యాల వద్ద రెండు బైక్‌లు ఢీకొని చనిపోయాడు. శుభకార్యం రోజే ఇంట్లో విషాదం నిండిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికల గురుకులంలోకి యువకులు..?

- ప్రశ్నించిన విద్యాలయం ప్రిన్సిపాల్
- పరుగు పెట్టిన ఓ యువకుడు
- మరో యువకుడిని చితకబాదిన తల్లిదండ్రులు..

ధర్మారం: మండలంలోని మల్లాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం విద్యాలయం వద్ద శనివారం ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. గమనించిన ప్రిన్సిపాల్ గిరిజా వారిని నిలదీయగా.. ఓ యువకుడు పరుగుపెట్టాడు. మరో యువకుడు అక్కడే ఉండగా.. అతడిని తల్లిదండ్రులు విద్యాలయంలోకి తీసుకెళ్లి చితకబాది పోలీసులకు అప్పగించారు. విద్యాలయంలో చదువుకుంటున్న పిల్లలను తల్లిదండ్రులు కలుసుకునేందుకు ప్రతినెలా రెండో శనివారం ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ క్రమంలో గోదావరిఖనిలోని లెనిన్‌నగర్‌కు చెందిన రాజు, సుల్తానాబాద్‌కు చెందిన బొడ కౌశిక్ విద్యాలయానికి చేరుకున్నారు. లోపలికి వెళ్లే క్రమంలో అనుమానం వచ్చిన ప్రిన్సిపాల్ గిరిజా వారిని అడ్డుకున్నారు. దీంతో రాజు అక్కడి నుంచి పరుగుపెట్టాడు. కౌశిక్‌ను తల్లిదండ్రులు పట్టుకుని ప్రశ్నించగా సమాధానం చెప్పలేదు. దీంతో తల్లిదండ్రులు అతడిని గదిలోకి తీసుకెళ్లి చితకబాదారు. ప్రిన్సిపాల్ గిరిజా ధర్మారం పోలీసులకు సమాచారమిచ్చారు. వారు కౌశిక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతడి ద్వారా వివరాలు రాబడుతున్నట్లు సమాచారం. విద్యాలయంలో తన చెల్లె చదువుకుంటోందని, ఆమె చూద్దామని రాజు కోరగా వచ్చానని కౌశిక్ చెబుతుండడం గమనార్హం. అయితే చెల్లెను చూసేందుకు వస్తే రాజు ఎందుకు పారిపోతాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఘనంగా పోచమ్మ బోనాలు

కాల్వ శ్రీరాంపూర్ : మండలంలోని మంగపేట గ్రామంలో శనివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి బోనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. పోచమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తల్లి ఆశీస్సులతో ప్రజల సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. డబ్బు చప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకున్నారు. శివసత్తుల పూనకాలతో పోచమ్మ తల్లి దేవాలయానికి ఊరేగింపుగా వెళ్లారు. కల్లు పాయసం, గుడాలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పిల్లాపాపలు, పాడి పంటలు, ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండేలా దీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, పురుషోత్తం రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ దేవయ్య సర్పంచ్ బుర్ర మంగ, మాజీ సర్పంచ్ సదానందం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



శ్రీనివాస్(ఫైల్)

కమాన్‌పూర్(మంథని): మండలంలోని జూలపల్లి శ్రీరాంనగర్ వద్ద శనివారం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రామగిరి మండలం చందనాపూర్‌కు చెందిన మేకల శ్రీనివాస్ (28) మృతి చెందాడు. ఎస్సై షేక్‌మస్తాన్ కథనం ప్రకారం.. మేకల శ్రీనివాస్ చందనాపూర్ నుంచి రొంపికుంటకు తన బైక్‌పై వెళ్లి వస్తున్నాడు. శ్రీరాంనగర్ వద్ద శ్రీఆదివరహస్వామి ఆలయానికి వెళ్లే దారి నుంచి జూలపల్లికి చెందిన చొప్పరి శ్రీను తన బైక్‌తో రోడ్డు ఎక్కుతుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. శ్రీనివాస్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. 108లో గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే శ్రీనివాస్ మృతి చెందాడు. మృతుడి అన్న మేకల రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



రాజన్న (ఫైల్)

ధర్మపురి: మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. హెడ్ కానిస్టేబుల్ సలీం వివరాల ప్రకారం.. మండలంలోని తీగలధర్మారానికి చెందిన జంగిలి రాజన్న (60) తాగుడుకు బానిసయ్యాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో శనివారం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కెనాల్‌లో పడి గుర్తు తెలియని వ్యక్తి ..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలో ఎస్సారెస్పీ కెనాల్‌లో శనివారం గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు. సదరు వ్యక్తి కాలకృత్యాలు తీర్చుకోవడానికి మెట్ల మీదుగా కెనాల్‌లోకి దిగాడు. అక్కడ కాలు జారి అందులో పడిపోయాడు. నీటిలో కొట్టుకుపోతుండగా కొందరు గమనించి అతన్ని బయటకు తీశారు. కానీ అప్పటికే అతడు మరణించాడు. మృతుడి వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, అతడి ఒంటిపై తెలుపు రంగు దుస్తులు ఉన్నాయని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని పోస్టుమార్టం గదిలో ఉంచామని, సంబంధీకులు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి ..



అభిలాశ్(ఫైల్)

సిరిసిల్లఅర్బన్/ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు శివారులో శనివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన విద్యార్థి మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వెంకటాపూర్‌కు చెందిన గొట్టె దేవయ్య–లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. అభిలాశ్(20) హైదరాబాద్‌లో డిగ్రీ చదవుతున్నాడు. స్నేహితుడి వివాహానికి శుక్రవారం స్వగ్రామానికి వచ్చాడు. రాత్రి పెళ్లి బరాత్‌లో పాల్గొని, పని నిమిత్తం శనివారం వేకువజామున 4 గంటల సమయంలో మరో స్నేహితుడు సామిత్‌తో కలిసి బైక్‌పై సిరిసిల్లకు బయలుదేరాడు. పెద్దూరు శివారుకు రాగానే గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అభిలాశ్ పరిస్థితి విషమింగా ఉండడంతో కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సామిత్ చికిత్స పొందుతున్నాడు. విద్యార్థి మృతితో వెంకటాపూర్‌లో విషాదం అలుముకుంది.

ఫకీర్ల ముసుగులో సెల్‌ఫోన్ చోరీ

- పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు



ఫకీర్లను పట్టుకున్న స్థానికులు

మల్యాల(చొప్పదండి): ఫకీర్ల ముసుగులో సెల్‌ఫోన్ చోరీ చేసి స్థానికులకు చిక్కిన సంఘటన మండలంలోని మానాల గ్రామంలో జరిగింది. గ్రామస్తుల వివరాలు.. జగిత్యాల రూరల్ మండలం టీఆర్ నగర్‌కు చెందిన ముగ్గురు శనివారం మానాల గ్రామానికి ఓ ఆటోలో వెళ్లి దుకాణాల్లో సాంబ్రాని పొగ వేసుకుంటూ యాచన చేస్తున్నారు. 'మీ ఇంట్లో దెయ్యం ఉందని, మీకు మంత్రాలు చేశారు' అంటూ ప్రజలను నమ్మిస్తూ ఇంటింటికీ తిరిగారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆమె ఇంటికి వెళ్లి, నయం చేస్తామంటూ నమ్మబలికారు. ఆమె తలపై ఒకరు నెమలి ఈకల కట్ట ఉంచగా, మరొకరు పక్కనే ఉన్న సెల్‌ఫోన్ చోరీ చేశారు. కొద్దిసేపటికే బాధితురాలు సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు గ్రహించి, స్థానికులు తెలిపింది. అప్పటికే ఫకీర్లు సెల్‌ఫోన్ తమ వద్ద ఉంచుకుని సిమ్ మరోచోట పడేశారు. స్థానికులు అడ్డగించగా తమకేమీ తెలియదని బుకాయించారు. అనంతరం వారిని మల్యాల పోలీసులకు అప్పగించినట్లు స్థానికులు తెలిపారు.

ఏఎల్పీని సందర్శించిన జీఎంలు



ఏఎల్పీ గనిలోకి వెళ్తున్న జీఎంలు

రామగిరి (మంథని): సింగరేణి సంస్థ అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌ను జీఎంలు ఎస్.జగన్మోహన్ రావు, ఎస్.సాంబయ్య సందర్శించారు. యంత్రాల పనితీరు, ఉత్పత్తి, రవాణా అంశాలపై గని అధికారులతో చర్చించారు. గని లోపలికి వెళ్లి యంత్రాల పనితీరు, డాస్కో యంత్రం, రక్షణ చర్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, కార్పొరేట్ డీజీఎం చక్రవర్తి, ఏరియా రక్షణ అధికారి సీహెచ్.వెంకటరమణ, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వరరావు, ఇంజినీర్ రఘురాం పాల్గొన్నారు.

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–11గనిని డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీనివాస్ శనివారం సందర్శించారు. మ్యాప్‌ద్వారా పనిస్థలాల్లో రక్షణ చర్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆర్జీ–1 జీఎంతో కలిసి మ్యాన్ రైడింగ్ ద్వారా గనిలోకి వెళ్లారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. డైరెక్టర్ వెంట అధికారులు శ్రీనివాస్, నెహ్రూ, సురేష్‌కుమార్ తదితరులున్నారు.

కార్మిక సంక్షేమంపై దృష్టి సారించాలి

- సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం దృష్టి సారించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జీడీకే–11 గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గనికి వెళ్లే రోడ్డు సరిగా లేక విధులకు వెళ్లేందుకు కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, వీధి దీపాలూ సరిగా లేవని, తాగునీటికి ఇబ్బంది తప్పడం లేదని పేర్కొన్నారు. హెల్త్ కార్డులతో ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్తే సరిగా ట్రీట్‌మెంట్ చేయడం లేదని విమర్శించారు. కార్మికుల డిప్యూటేషన్ పేరుతో పైసల దందా నడుస్తోందన్నారు. కార్మికుల పదోన్నతి విషయంలో వివక్ష చూపుతున్నారని, రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని కార్మికులు వడదెబ్బకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు అన్నం శ్రీనివాస్, ఇప్పలపల్లి సతీశ్, జంగాలపల్లి మల్లేశ్, గజేంద్ర, శ్రీనివాసరావు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి స్థలాలు ఆక్రమణకు గురికానీయొద్దు



వివరాలు తెలుసుకుంటున్న బలరాం

గోదావరిఖని: సింగరేణి సంస్థ స్థలాలు అక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్(పా) బలరాం ఆదేశించారు. శనివారం గోదావరిఖనిలోని ఆర్జీ–1 ఏరియా మిలీనియం బ్లాక్, తిలక్‌నగర్, విఠల్‌నగర్ కాలనీలను తనిఖీ చేశారు. కాలనీలలోని సింగరేణి క్వార్టర్ల నిర్వహణ ఖాళీ స్థలాలు, తిలక్‌నగర్‌లోని పాత సింగరేణి పాఠశాల భవనం, ఆర్‌ఓ ప్లాంట్, సీనియర్ ఉద్యోగుల భవనం, విఠల్‌నగర్‌లోని పార్క్‌ను పరిశీలించారు. ఆయన వెంట డీజీఎం పర్సనల్ సీహెచ్.లక్ష్మీనారాయణ, సర్వే అధికారి ప్రభాకర్, ఎస్టేట్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం, సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులున్నారు.

కేంద్రం తీరును ఎండగడుతాం



యూనియన్ కార్యాలయంలో మాట్లాడుతున్న మల్లయ్య

- టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెంగర్ల మల్లయ్య

గోదావరిఖని: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెంగర్ల మల్లయ్య అన్నారు. శనివారం టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. యూనియన్ గౌరవాధ్యక్షురాలు కవితను ఈడీ పేరిట వేధించడాన్ని ఖండించారు. ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలలో మాత్రమే దాడులు జరగడం కక్ష సాధింపు చర్య అన్నారు. సమావేశంలో నాయకులు గండ్ర దామోదర్‌రావు, దేవ వెంకటేశం, వడ్డేపల్లి శంకర్ పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

- బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: సింగరేణికి రూ.25వేల కోట్ల విద్యుత్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 2014 నుంచి బకాయిలు పేరుకుపోయాయన్నారు. కార్మికుల మారుపేర్ల మార్పుతోపాటు అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్మికుల హక్కుల సాధనలో అహర్నిశలు శ్రమిస్తున్న బీఎంఎస్‌ను రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. మీటింగ్‌లో నాయకులు ఆకుల హరిణ్, తాట్ల లక్ష్మయ్య, సాంబయ్య, రాపల్లి వజ్రవేణు, భీమునిపెల్లి నారాయణ, కోటయ్య, రాజేశం, ఆరేపల్లి వెంకటరాజం, జనగామ రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

రెండు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



గాయపడ్డ బ్రహ్మం



వెంకటేశం

మంథని: మంథని ప్రాంతంలో శనివారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిలో కూచిరాజ్‌పల్లి శివారు మంథని నుంచి పెద్దపల్లి వైపు ఇటుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా జాకీ లేవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఆ సమయంలో ట్రాక్టర్ వెనుక వస్తున్న కారు డ్రైవర్ అప్రమత్తమై ఢీ కొంటాననే భయంతో కుడి వైపు తిప్పాడు. అయితే ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ద్విచక్రవాహనంపై ఉన్న ముదారకుల వెంకటేశం కుడి కాలుకు గాయమైంది. అలాగే ట్రాక్టర్ డ్రైవర్ శనార్దన్ ఉరఫ్ బ్రహ్మం ముక్కు, చాతీ భాగంలో గాయాలయ్యాయి. ఇద్దరిని స్థానిక సామాజిక వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించి అనంతరం కరీంనగర్ తరలించారు. మంథని మండలం సూరయ్యపల్లి శివారు జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచర్ల నుంచి గంగాపురికి ద్విచక్రవాహనంపై మంథని వైపు వస్తున్న బైక్ అదుపుతప్పి సమీపంలో ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ద్విచక్ర వాహనంపై ఉన్న తాడిచర్లకు చెందిన కాలవ్వల వెంకటి.. మండలంలోని పుట్టపాకకు చెందిన కస్నూరి వెంకటేశ్‌కు తల, ఇతర భాగాల్లో బలమైన గాయాలు కావడంతో కరీంనగర్ తరలించారు. బైక్‌పై మరో వ్యక్తి ఉన్నట్లు స్థానికులు తెలిపారు.